నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | జూన్ 08, 2024 | www.navatelangana.com

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-రామారెడ్డి

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన సిద్ధం శివప్రసాద్ (25) తండ్రి అనారోగ్యానికి గురవగా.. ఆసుపత్రిలో చూపించడానికి అప్పుచేశాడు. అప్పులు అధికం కావడంతో మనస్తాపం చెంది సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు గమనించి, చికిత్స నిమిత్తం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. భార్య సిద్ధం భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సుభాషిని తెలిపారు.

స్టాక్ అడ్డగింత

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ సింగిల్ విండోకు వచ్చిన స్టాక్‌ను రైతుల సౌకర్యార్థం తాడ్‌బిలోలి, సాటాపూర్ గిడ్డంగులలో భద్రపరచిన స్టాక్‌ను తిరిగి రెంజల్ గిడ్డంగికి తరలిస్తుండగా మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి అడ్డుకున్నారు. నిత్యావసర వస్తువుల చట్టం కింద 6ఎ కింద ఈసీ ఏసీటీ 1955 ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ఎఫ్‌టిఓ 1985 ప్రకారం కేసు నమోదు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. తర్వాత సొసైటీ సిబ్బంది తిరిగి తాడ్‌బిలోలి, సాటాపూర్, గిడ్డంగుల నుంచి పట్టి స్టాకును డీసీఎం ద్వారా తిరిగి రెంజల్ గోడౌన్‌కు తరలించడం చటరీత్యా కేసు నడుస్తున్న సమయంలో వాటిని తరలించడం నేరమని, స్థానిక రెంజల్ ఎస్సై ఈ.సాయన్నకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఘటనా స్థలానికి విచ్చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

జనాభా ఉన్నా.. లెక్కల్లో సున్నా..

ప్రభుత్వం సంక్షేమ పథకాల మంజూరి కోసం చేపట్టే సర్వేలలో ఏ చిన్న పొరపాటు జరిగినా.. అది ఎంత నష్టానికి గురిచేస్తుందో అందరికి తెలిసిందే. కానీ జనాభా లెక్కల నమోదు కోసం సిబ్బంది చేసిన చిన్న పొరపాటు ఒక కులానికే తీవ్రనష్టం కలిగింది. దాంతో వారు గ్రామంలో బతికి ఉన్నా.. జనాభా లెక్కల్లో మాత్రం లేకుండా పోయారు. దాంతో గ్రామానికి నిధులు తగ్గుతున్నాయి. ఈ విషయమై స్థానిక అధికారులకు అడిగితే.. ఉన్నతాధికారులకు నివేదించామని చెబుతున్నారు.

జనాభా లెక్కల్లో లేని పెంటాకలాన్ ఎస్సీ కుటుంబాలు

- 2011 జనాభా లెక్కల సర్వేలో సిబ్బంది చేసిన పొరపాటు
- గ్రామానికి తగ్గుతున్న నిధులు

నవతెలంగాణ-బోధన్



పెంటాకలాన్ గ్రామ ముఖచిత్రం

బోధన్ మండలం పెంటాకలాన్ గ్రామంలో ఎస్సీల జనాభా ఉన్నా.. జనాభా లెక్కల్లో మాత్రం వారు గల్లంతయ్యారు. దాంతో ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు కావడం లేదు. దాంతో ఎస్సీ కాలనీలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు గ్రామానికి మంజూరయ్యే నిధులతో కొంతవరకు వెచ్చించి చేపడుతున్నారు. పెంటకలాన్ గ్రామం, భూలక్ష్మిక్యాంప్ గ్రామం గతంలో కలిసి ఉండేవి. ఈ క్రమంలో 2011 జనాభా లెక్కల సర్వేలో భాగంగా సిబ్బంది చేసిన పొరపాటుతో పెంటకలాన్ గ్రామంలో ఎస్సీ జనాభా లేరని నమోదైంది. అసలు భూలక్ష్మి క్యాంప్ గ్రామంలో ఎస్సీల జనాభా లేదు. కానీ భూలక్ష్మీక్యాంప్ ప్రభావం ఉమ్మడి గ్రామంగా ఉన్న పెంటాకలాన్‌పై పడడంతో పెంటాకలాన్‌లో ఎస్సీల జనాభా లేదని నమోదైంది. జనాభా లెక్కల సర్వేలో జరిగిన పొరపాటుతో ఎస్సీ జనాభా లేదని నమోదైంది. సరిచేద్దామంటే ఆ వివరాలు అప్పటికే ప్రభుత్వానికి వెళ్లిపోయాయి. దాంతో అప్పటి నుంచి నేటి వరకు పెంటకలాన్ గ్రామంలో ఎస్సీ జనాభా ఉన్న కూడా జనాభా లెక్కలల్లో మాత్రం లేనట్లుగా ఉంది. 2011 జనాభా లెక్కలలో ఉమ్మడి పెంటాకలాన్ మొత్తం జనాభా 2,356 ఉండాలి. కానీ 1,776 జనాభా ఉన్నట్లు నమోదైంది. దాంతో ఎస్సీ జనాభా సంఖ్య తప్పిపోయినట్లయింది.

ప్రస్తుతం పెంటాకలాన్ గ్రామంలో మొత్తం జనాభా 1,692, కాగా 365 కుటుంబాలు, 984 ఓటర్లు ఉన్నారు. ఇందులో 432 ఎస్సీ జనాభా, 120 కుటుంబాలున్నాయి. ఎస్సీల జనాభా లెక్కల్లో లేకపోవడంతో దానికి సంబంధించిన సబ్‌ప్లాన్ నిధులు మంజూరి కావడం లేదు. దాంతో సుమారు 4లక్షల రూపాయల నిధులు గ్రామాభివృద్ధికి అందడం లేదు. ఇదిలా ఉంటే స్థానిక ఎన్నికల్లో మాత్రం ఎస్సీలకు గ్రామంలో ఓటుహక్కు ఉండడంతో పోటీ చేయడానికి అవకాశం ఉన్నా.. జనాభా లెక్కల్లో మాత్రం ఎస్సీలు గల్లంతవడంతోనే అయోమయం నెలకొంది. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి రేఖను వివరణ కోరగా 'పెంటాకలాన్ గ్రామాభివృద్ధికి జనాభా ప్రాతిపదికన రావలసిన నిధులు తక్కువ రావడంతో సమస్య ఎక్కడుందోనని క్షుణ్ణంగా పరిశీలించాను. 2011 జనాభా లెక్కల్లో పెంటాకలాన్ గ్రామంలోని ఎస్సీల జనాభా గల్లంతయిందని గుర్తించాను. దాంతో ఈ సమస్య సరిచేయాలని, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరయ్యేలా చూడాలని పలుమార్లు ఉన్నతధికారులకు విన్నవించాను. కానీ అప్పటికే జనాభా లెక్కల వివరాలు ప్రభుత్వానికి చేరిపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు ప్రభుత్వం జనాభా లెక్కల సర్వే చేయకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది.' అని తెలిపారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం

పెంటాకలాన్ గ్రామంలో జనాభా లెక్కల్లో జరిగిన పొరపాటులో భాగంగా ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవోకు సమస్య వివరించాలి. ఆయన డిపిఓ ద్వారా కలెక్టర్‌కు వివరిస్తూ లెటర్ అందిస్తే కలెక్టర్ ద్వారా హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్తారు. దాంతో అక్కడ ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. వచ్చే ఎలక్షన్ నాటికి ఇలాంటి సమస్యలన్నీ పరిష్కారమయ్యే అవకాశం ఉంది. జనాభా లెక్కల్లో లేకున్నా గ్రామంలో గల ఓటర్ లిస్టులో ఓటర్‌గా నమోదు అయితే వారి రిజర్వేషన్ ప్రకారం పోటీ చేసే అవకాశం ఉంటుంది. కావున త్వరలో ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది.

- సాయిబాబా, డిఎల్‌పీఓ, బోధన్.

ప్రశ్నార్థకంగా 'మన ఊరు.. మన బడి'

సర్కారు పాఠశాలల్లో పనుల్లో జాప్యం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



లింగంపల్లి తండా గ్రామంలో మధ్యలో ఆగిపోయిన పనులు

సర్కారు బడులు కుదేలవుతున్నాయి. సవాలక్ష సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల్లేక చదువులు కుంటుపడుతున్నాయి. గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మన ఊరు.. మన బడి కార్యక్రమం జిల్లాలో అంతంతమాత్రంగానే అమలైంది. అత్యధిక పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. గత నాలుగు ఏండ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. మరెన్నో పనులు ఇంకా మొదలే కాలేదు. నిధులు సకాలంలో మంజూరు కాకపోవడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇదే క్రమంలో ప్రభుత్వం మారిపోవడంతో కొత్తగా నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండటంతో 'మన ఊరు.. మన బడి' ముందుకు సాగుతుందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళా ఇదే కార్యక్రమాన్ని మరో పేరుతో గానీ, కొత్త మార్గదర్శకాలతో గానీ కొనసాగిస్తే.. ఇప్పటి వరకు నిలిచిన నిధులు సకాలంలో మంజూరవుతాయా.. పాఠశాలల పున్ణప్రారంభం కల్లా అభివృద్ధి పనులు పూర్తయి విద్యార్థులకు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయా..? అనే చర్చ సాగుతోంది.

మన ఊరు.. మన బడి కార్యక్రమం 2021 డిసెంబరులో ప్రారంభమైంది. 4 పాఠశాలల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినా.. అప్పటి నుంచి అలాగే కొనసాగుతున్నాయి. నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్, కంశెట్‌పల్లి, లింగంపల్లి తండా, ఫకీర్‌నాయక్ తండాలో పాఠశాలల నూతన భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఆర్భాటంగా పనులు ప్రారంభించినా.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు ముందుకు సాగడం లేదు. దీనికి తోడు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు సక్రమంగా విడుదల చేయలేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు కాంట్రాక్టర్లు చెప్పారు. అప్పులు తీసుకొచ్చి పనులు చేసినప్పటికీ తమకు ఇంకా బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేనా..?

ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్నాయి. పాఠశాలల పున్ణప్రారంభానికి ఇంకా 4 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు ఈ పనులు పూర్తయ్యేనా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిధులు మంజూరైతే గానీ ఏదైనా చేయగలమని సంబంధిత కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కానీ పనులు అసంపూర్తిగా ఉండటంతో తరగతులకు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని తల్లిదండ్రులు అంటున్నారు. ఇదిలా ఉండగా మన ఊరు.. మనబడి కార్యక్రమం విషయంలో కొత్త సర్కారు తీసుకొనే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇదెలా ఉండబోతుంది.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తుందనే విషయంపై విద్యాశాఖలో జోరుగా చర్చసాగుతోంది.

బిచ్కుందలో చెత్తతో పూడ్చిన గుంతలు

నవతెలంగాణ-బిచ్కుంద



రోడ్డుపై గుంతలో వేసిన చెత్త

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి రోజు గ్రామ పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులతో తడిచెత్త, పొడిచెత్త, సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలి. తరలించిన చెత్తను ఎరువులుగా తయారుచేసి గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని లక్షలు ఖర్చు పెట్టి గత ప్రభుత్వం డంపింగ్ యార్డ్‌లు నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. కానీ గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో సేకరించిన చెత్తను ప్రధాన రహదారుల గుంతలు పూడ్చడానికి ఉపయోగిస్తున్నారు. శుక్రవారం బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ముందలగల రోడ్డుపై ఏర్పడిన గుంతలో గ్రామంలో సేకరించిన చెత్త చెదారం వేసి చదును చేశారు. గుంతలు ఏర్పడ్డ చోట మొరం లేదా భీటితో నింపాల్సి ఉండగా గ్రామంలో సేకరించిన చెత్తను వేసి గుంతలు పూడుస్తున్న దృశ్యాలను చూసి స్థానిక ప్రజలు విశ్వయం చెందారు. ఈ విషయంపై మండల పంచాయతీ అధికారి మహబూబ్‌ను వివరణ కోరగా గ్రామంలో సేకరణ చెత్తాచెదారం డంపింగ్ యార్డ్‌కే తరలించాలని గుంతలు పూడ్చడానికి ఉపయోగించవద్దని ఈ విషయంలో గ్రామపంచాయతీ అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

అభ్యర్థుల హాల్ టికెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టిక్కెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఐడెంటిఫికేషన్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 09న ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల ప్రవేశ ద్వారం వద్ద అభ్యర్థుల హాల్ టిక్కెట్‌లను తనిఖీ చేయడానికి, నిర్దేశిత అభ్యర్థులు మాత్రమే ఎగ్జామ్ సెంటర్లోకి ప్రవేశిస్తున్నారని నిర్ధారించడానికి వీలుగా ప్రతి కేంద్రం వద్ద 50 మంది అభ్యర్థులకు ఒకరు చొప్పున ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ఐడెంటిఫికేషన్ అధికారులు 9వ తేదీన తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 7 గంటలకే చేరుకొని చీఫ్ సూపరింటెండెంట్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. సీఎస్‌లతో సమన్వయం ఏర్పర్చుకుని ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్ష నిర్వహణ కోసం అవసరమైన సహకారాన్ని అందించాలని హితవు పలికారు. ముఖ్యంగా నిజమైన అభ్యర్థులే పరీక్షకు హాజరవుతున్నారా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. హాల్ టికెట్‌పై ఇటీవలి ఫోటో అతికించబడిందా లేదా అన్నది జాగ్రత్తగా గమనించాలన్నారు. ఒరిజినల్ ఐడి ప్రూఫ్ (ప్రభుత్వంచే జారీ చేయబడిన ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవి) తనిఖీ చేసి, హాల్ టిక్కెట్‌తో సరిపోల్చాలని, వాస్తవ అభ్యర్థినే పరీక్షకు హాజరవుతున్నట్లు నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. హాల్ టిక్కెట్‌పై ముద్రించిన ఫోటో అస్పష్టంగా ఉంటే, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి చీఫ్ సూపరింటెండెంట్ మినహా మిగతా వారెవరూ సెల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తీసుకెళ్లడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లు, పరిశీలకులు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రం లోనికి ప్రవేశించే ముందు పరీక్షా కేంద్రం ప్రవేశ ద్వారం వద్దనే సిబ్బంది వద్ద తమ సెల్‌ఫోన్‌లను డిపాజిట్ చేయాలని, ఎవరైనా ఈ నిబంధనను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అభ్యర్థి ఎవరైనా సెల్ ఫోన్, బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పరీక్షా కేంద్రం లోనికి తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తే, క్రిమినల్ కేసు బుక్ చేయడంతో పాటు డిబార్ చేయబడతారని తెలిపారు. సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్త రామ్మోహన్, డీఈఓ దుర్గాప్రసాద్, డీఐఈఓ రవికుమార్, విద్యాశాఖ పరీక్షల నియంత్రణ విభాగం సహాయ కమిషనర్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల విక్రయదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలి

- అవసరమైతే పీడీయాక్ట్ నమోదు చేసి దుకాణాలు సీజ్ చేయాలి
- వారంలో ఒకరోజు తహసీల్దార్లు తప్పక హాస్టల్స్, స్కూల్స్ సందర్శించాలి
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి




సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తదితరులు

నవతెలంగాణ-కామారెడ్డి

నకిలీ విత్తనాల విక్రయదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేసి దుకాణాలు సీజ్ చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. వరినాట్లు ప్రారంభమైనందున రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోకుండా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా ప్రజాపరిషద్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు సరిపడా అందించాలని సూచించగా ఇప్పటి వరకు 4,600 క్వింటాళ్ల జీలుగు, 1343 క్వింటాళ్ల జనుము విత్తనాలను అందజేశామని, అదనపు కేటాయింపునకు ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇస్తుందని ప్రకటించిన విషయాన్ని రైతులకు తెలిపి సన్న ధాన్యం పండించేలా వ్యవసాయ విస్తరణాధికారులు అవగాహన కలిగించాలన్నారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ కాన్పులు పెరిగేలా చూడాలన్నారు. సదరం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక కారణంగా వికలాంగులు నష్టపోకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించి సదరం సర్టిఫికెట్లు అందించేలా చూడాలని కోరగా.. రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి ఆన్‌లైన్ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. రెండు పడకల గదుల ఇళ్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలని, కొత్త పథకాల అమలు, పాత పథకాల పేరు మార్పులపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

విద్యాశాఖను సమీక్షిస్తూ రెండు, మూడు రోజులలో అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 947 పాఠశాలలో విద్యుత్, మంచినీరు, టాయిలెట్స్, చిన్న చిన్న మరమ్మతు వంటి పనులు గుర్తించి చేపట్టామన్నారు. గతంలో టాయిలెట్స్ యూనిట్ల నిర్మాణానికి 2, 3లక్షల వరకు అంచనాలు ఉండగా నేడు కింద లక్ష రూపాయల లోపే టాయిలెట్స్ యూనిట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా పాఠశాలలను, టాయిలెట్స్ శుభ్రం చేయుటకు ఒక ఉద్యోగి ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నదని, త్వరలో నిర్ణయం వెలువడనుందని, మన ఊరు మనబడి కింద 18 కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నామని సభ్యులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానమిచ్చారు. పౌర సరఫరాల శాఖను సమీక్షిస్తూ ఆరుగాలం కష్టించి పండించి అకాలవర్షాల వల్ల ధాన్యం తడిచి బాధపడుతున్న రైతుల నుంచి క్వింటాల్‌కు 5కిలోల చొప్పున తరుగు తీయడం బాధాకరమని తెలిపారు. వచ్చే సీజనుకైనా ప్రణాళికా బద్ధంగా ధాన్యం కొనుగోలు చేయాలని పలువురు సభ్యులు సూచించారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తున్న చౌకధరల దుకాణాల ద్వారా దారుణమైన బియ్యం సరఫరా చేస్తున్నారని, వసతి గృహాలు, పాఠశాలలో విద్యార్థులు భోజనం చేయలేని పరిస్థితులలో ఉన్నారని సభ్యులు బాధను వ్యక్తం చేయగా వారంలో ఒక రోజు తహసీల్దార్లు తప్పక హాస్టల్స్, స్కూల్స్ సందర్శించి భోజనం రుచి చూసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నామన్నారు. భూగర్భజలాల పెంపునకు ఉపాధి హామీ కింద జిల్లాలో 20వేల పంపాడ్స్ నిర్మాణాలు చేపట్టాలని ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ తెలిపారు. ఈజీఎస్ కింద 4,285 పనులు చేపట్టి 22లక్షల 60వేల మందికి ఉపాధి కల్పించామన్నారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి వితంతు పింఛన్లు మంజూరు కావడం లేదని సభ్యులు ప్రశ్నించగా తగు ప్రాసెస్ చేస్తున్నామన్నారు. పలు ప్రాంతాలలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, వర్షాకాలం ప్రారంభమైనందున ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రమాదాలు జరగకుండా చిన్న చిన్న గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలని, అవసరమైన దగ్గర బ్రిడ్జిల నిర్మాణం, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. నీటిపారుదల శాఖను సమీక్షిస్తూ కాళేశ్వరం ప్రాజెక్ట్ 22వ ప్యాకేజీ పనులు, మంజీరా ఎత్తిపోతల పథకం పనులు కొనసాగుతున్నాయని అన్నారు. రైతులు తమ పంట పొలాలకు చెరువుల నుంచి మట్టి తీసుకెళ్లటకు అభ్యంతరం చెప్పవద్దని, రెవిన్యూ, మైన్స్‌శాఖల సమన్వయంతో పర్యవేక్షించాలని, రైతుల మధ్య అపోహాలు సృష్టించవద్దని కలెక్టర్ ఎస్ఈని ఆదేశించారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ కార్యక్రమాలను సభ్యులు సమీక్షించారు. ఇదే చివరి జెడ్పి సమావేశమని, గత ఐదేండ్ల నుంచి సభలు, సమావేశాలు సజావుగా నిర్వహించి ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరింపజేయడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు చైర్‌పర్సన్ శోభ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ చందర్, జెడ్పి వైస్‌చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, జిల్లా అధికారులు భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, విజయలక్ష్మి, రాజు, నిత్యానందం, హనుమంతరావు, రవి శంకర్, రాజేంద్ర కుమార్, జెడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి

- ఎత్తొండలో రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

నవతెలంగాణ-కోటగిరి

తమ నుంచి కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని ఎత్తొండ సొసైటీ పరిధిలోని రైతులు శుక్రవారం సొసైటీ ఆవరణలో ఆందోళనకు దిగారు. రూ.కోటి 80 లక్షల విలువ గల ధాన్యాన్ని కొనుగోలు చేసిన సొసైటీ.. ఇప్పటివరకు పైకం చెల్లించలేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ సునీత ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సొసైటీ ద్వారా కొనుగోలు చేసిన రైతుల వరి ధాన్యం వివరాలను తక్షణమే అందజేయాలని కార్యదర్శిని ఆదేశించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బాయిల్ రైస్‌మిల్ సీజ్ చేయడంతో సమస్య ఏర్పడిందని కొందరు పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ రైతుల డబ్బులు వెంటనే చెల్లించాలని రైతులు వాపోయారు.

ప్రయివేటు క్లినిక్‌లు నిబంధనలు పాటించాలి

- నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్



క్లీనిక్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

నవతెలంగాణ-బోధన్

ప్రైవేట్ క్లినిక్‌లు, ల్యాబ్‌లు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ అన్నారు. శుక్రవారం ఆయన బోధన్, కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లోని పలు ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్‌లను, ఆప్టికల్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల వారు ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ సూచనలు పాటించాలని అన్నారు. లేనియెడల చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్లు, పేషంట్లకు ఉన్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. వైద్యుల విద్యార్హతలను, విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. కోటగిరి, పోతంగల్ ఆసుపత్రులలో భద్రపరిచే ఫ్రిజ్‌లను పరిశీలించారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో అన్ని రకాల సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఉప వైద్య అధికారిని డాక్టర్ విద్యతో పాటు సూపర్వైజర్ నిర్మల, సుజాత, వైద్య సిబ్బంది నాగరాజు ఉన్నారు.

చేపల కోసం బారులు



చేపలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

నవతెలంగాణ-ముప్కాల్

'మృగశిర కార్తె' ప్రారంభంను పురస్కరించుకుని శుక్రవారం ముప్కాల్ చేపల మార్కెట్ వద్ద తెల్లవారుజాము నుంచి కొనుగోలు దారులు చేపల కొనుగోలు కోసం క్యూ కట్టారు. మార్కెట్‌లో కిలో చేప ధర రూ.120 ఉండడంతో చేపలు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయని వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఒకవైపు కిలో చికెన్ ధర మార్కెట్ లో రూ.260, మటన్ ధర కిలో రూ.600 రూపాయలకు పైగా ఉండడంతో వంటప్రియులు సాధారణ రోజులలో కూడా ఫిష్‌పై మక్కువ చూపుతున్నట్లు చేపల వ్యాపారులు ఈ సందర్భంగా తెలిపారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముస్కునర్సయ్య

నవతెలంగాణ-ముప్కాల్

మమత నర్సింగ్ 'హెూం' ముప్కాల్ 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులుగా కొనసాగుతున్న జిల్లా స్థాయి సర్కిల్ క్రికెట్ పోటీలు శుక్రవారం దూదిగాం, మెండోరా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. బీజేవైఎం కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రికెట్ పోటీల్లో మొత్తంగా 16 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ కమిటీ సభ్యులు కె.గంగాధర్, టి.సాయన్న, గద్దల గంగారాం, అంజయ్య, పీడీ రాజ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, అజయ్, నవీన్, ముస్కు శ్రీను, అన్వేష్, సాయి, మహేష్ చారి, ముజ్జు తదితరులు పాల్గొన్నారు..

నేటినుండి ఈసెట్ ఫస్ట్ ఫేజ్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మూడేళ్ళ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు పూర్తి చేసుకొని నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలోకి ప్రవేశం పొందుటకు ఈ సెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ నెల 8 నుండి మొదలవుతుందని జిల్లా కౌన్సెలింగ్ సమన్వయకర్త సి. శ్రీరామ్ కుమార్, కౌన్సిలింగ్ సిస్టం ఆడ్మిన్ బాను చందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ పాల్గొనే అభ్యర్థులు ఈనెల 8 నుండి 11 వరకు tgecet.nic.in web లో సంబంధిత స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు ఈనెల 10 నుండి 12 వరకు ధృవపత్రాల పరిశీలన జరుగుతుందని అన్నారు. ధృవపత్రాల పరిశీలన చేసుకున్న అనంతరం అభ్యర్థులు తమకు నచ్చిన ఐచ్చికాలను అంతర్జాలంలో పొందుపర్చాలని సూచించారు. ఐచ్చికలను ఈ నెల 10 నుండి 14 వరకు గడువు ఉంటుందని, సీట్ల కేటాయింపు 18 న ఉంటుందన తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 18 నుండి 21 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ ఫీజు చెల్లింపులు చేయవల్సి ఉంటుందని అన్నారు. మరింత సమాచారం కోసం వెబ్సైట్ tgecet.nic.in ను సంప్రదించాలని సూచించిరు. ధృవపత్రాల పరిశీలనకు హజరయ్యే విద్యార్థులు ఈసెట్ హాల్ టికెట్, ఈసెట్ ర్యాంక్ కార్డ్, ఎస్ఎస్సి మెమో, డిప్లమా, మార్కుల మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్ (6 నుండి డిప్లొమా), కాస్ట్ సర్టిఫికెట్, ఇన్కమ్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, టీసీ, ఆధార్ కార్డు లు ఒరిజినల్ జిరాక్స్ సెట్ తో తీసుకురావాలని అన్నారు.

లైసెన్సు పొందిన డీలర్ల వద్దనే ఎరువులు కొనాలి

- మండల వ్యవసాయ అధికారి



తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి

నవతెలంగాణ- బాల్కొండ

మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాలను శుక్రవారం తనిఖీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలం పంటలకు సంబంధించిన కాంప్లెక్స్ , యూరియా ఎరువులను రైతులకు తగిన మొత్తంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలో సొసైటీ ద్వారా 1400 బస్తాల యూరియా, 2000 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, ప్రైవేటు దుకాణాల ద్వారా యూరియా 2225 , కాంప్లెక్స్ 1100 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్, బిల్లులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. రైతులు లైసెన్సు పొందిన డీలర్ల ద్వారానే ఎరువులు విత్తనాలు కొనాలని కోరారు. ఎవరైనా లైసెన్సు లేకుండా విత్తనాలు ఎరువులను విక్రయిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలకు ఏకరూప దుస్తులు అందజేత



దుస్తులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు సెర్ప్ ఆధ్వర్యంలో కుట్టించిన ఏకరూప దుస్తులను శుక్రవారం అందజేశారు. ఈ మేరకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అందించాల్సిన ఏకరూప దుస్తులను సెర్ప్ సిబ్బంది అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు మాసం శ్రీనివాస్ కు అందజేశారు. ఈ సందర్భంగా సెర్ప్ సీసీ నవీన్ కుమార్ మాట్లాడుతూ ఏకరూప దుస్తులను సెర్ప్ ఆధ్వర్యంలో సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి మండలంలోని అన్ని పాఠశాలలకు ఏకరూప దుస్తులను సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సంధ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఉమ, మాజీ సర్పంచ్ పాలెం నరసయ్య, గ్రామ అభివృద్ధి కమిటీఅధ్యక్షులు రాథోడ్ సాగర్, గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారి పాలెం రాజేశ్వర్, మాజీ ఉప సర్పంచ్ అశోక్, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



దుస్తులు అందజేస్తున్న డీఆర్‌డీపి పీడీ

మండలంలోని కమలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రైమరి పాఠశాల ప్రధానోపాధ్యాయునికి డిఆర్‌డీఏ, డీఆర్‌డిఓ పిడి సాయాగౌడ్ దుస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. సమయానికంటే ముందే పాఠశాలకు ఇచ్చిన 28 టార్గెట్‌ను పూర్తి చేసి అందజేయడం అభినందనీయ మన్నారు. ఇతర పాఠశాలలకు సైతం సమయానికి ముందే అందజేసే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం నీలిమ, ఎపిఎం రంజిత, సిసిలు పాల్గొన్నారు.

జలమయం కాకుండా చర్యలు చేపట్టాలి



సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్



మురుగునీటితో నిండిన కాలువ

- మురుగు కాలువల్లో యుద్ధప్రాతిపదికన పూడిక తొలగించాలి
- క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వర్షపు జలాలు నిలువ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రాంతాలలో గల మురుగు కాలువల్లో వర్షపు జలాలు నిలువ ఉండకుండా పూడికతీత పనులను చేపట్టి పూర్తి స్థాయిలో వాటిని శుభ్రం చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపునీరు మురుగు కాలువల్లోకి చేరి, పూడికతీత వల్ల ముందుకు వెళ్లే అవకాశం లేక నగరంలోని పలు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్‌తో కలిసి నగరంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, డ్రైనేజీల స్థితిగతులను పరిశీలించారు. నిజామ్ కాలనీలోని డ్రైనేజీని, బోధన్ రోడ్ లోని రిలయన్స్ పెట్రోల్ బ్యాంకు సమీపంలో గల మురుగు కాల్వను, ఖిల్లా రోడ్ కు ఆనుకుని ఉన్న శ్రీనివాస్ కాలనీలోని డీ-54 కెనాల్ ను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో నగరంలోని ఏ ఒక్క ప్రాంతం కూడా జలమయంగా మారకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మురుగుకాలువల్లో పేరుకుపోయిన పూడికతో పాటు చెత్తా, చెదారం తొలగింపజేయాలని, ఎక్కడ కూడా వర్షపు నీరు నిలువ ఉండకుండా ముందుకు ప్రవహించేలా డ్రైన్లను శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాలు కురియకముందే డీ-సిల్టింగ్ పనులను పూర్తి చేయించాలని సూచించారు. అవకాశం ఉన్నచోట జేసీబీ వంటి యంత్రాలను వినియోగించాలని, వీలుకాని చోట పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించాలన్నారు. పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఇదివరకు వర్షాలు కురిసిన సమయాలలో వరద పరిస్థితి తలెత్తిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. డ్రైన్లలోకి చేరే వర్షపు జలాలు పూడిక కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోవడం వల్లే పలు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పూడికతీత పనులను పక్కాగా జరిపించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ ఇంచార్జ్ ఈ.ఈ ఆనంద్ సాగర్, డీ.ఈ వాసుదేవ్, ఏ.ఈలు ఇనాయత్, రవి తదితరులు ఉన్నారు.

శివాజీనగర్ పాఠశాలలో పనుల పరిశీలన

కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లోగల ప్రభుత్వ ఉచ్చతర ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న పనులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం పరిశీలించారు. ఐదు తరగతుల వరకు కొనసాగుతున్న ఈ పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులు సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. నీటి వసతిని పెంపొందించేందుకు వీలుగా చేపడుతున్న పనుల నాణ్యతను తనిఖీ చేశారు. మరో నాలుగు రోజులలో బడులు పున్ణ ప్రారంభం కానున్న దృష్ట్యా పనులను వేగవంతంగా జరిపించాలని అధికారులను ఆదేశించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించి, యుద్ధప్రాతిపదికన వాటిని పూర్తి చేయాలన్నారు. అనవసరమైన పనులను సైతం చేపట్టి నిధులను వృధా చేయరాదని, అలాంటి వాటికి బిల్లులు మంజూరు కావని స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణను చక్కగా శుభ్రం చేయించి విద్యార్థులకు వివిధ రకాల ఆటలు ఆడుకునేందుకు క్రీడా మైదానంగా వినియోగించాలని, దీనివల్ల పాములు, ఇతర విష పురుగులు వంటి వాటి బెడద కూడా నివారించబడుతుందని అన్నారు. కలెక్టర్ వెంట ఈ.ఈ దేవిదాస్, ఏ.ఈ ఉదయ్ కిరణ్ తదితరులు ఉన్నారు.

7న మాదిగల కవాతు విజయవంతం చేద్దాం

- ఎంపీ అరవింద్‌కు అభినందనలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు సరికేల పోశెట్టి

జూలై 7న మాదిగల కవాతును విజయవంతం చెయ్యాలని ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు సరికేల పోశెట్టి మాదిగ అన్నారు. ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎంఆర్ పిఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎస్పి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సరికేల పోశెట్టి మాదిగ మాట్లాడుతూ.. "జూలై 7 న ఎంఆర్పిఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో జరిగే మాదిగల కవాతును విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కవాతు మాదిగల ఆత్మగౌరవనికి ప్రతీకగా ప్రతి ఒక మాదిగ చూడాలని, లక్షలాది మంది మాదిగలు ఈ కవాతుకు హాజరై విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఎంఆర్పిఎస్ జిల్లా నాయకత్వం గ్రామగ్రామాన తిరిగి నూతన కమిటీలు నిర్మాణం చేసి, జెండా గద్దెలు నిర్మాణం చేసి మాదిగలను ఏకం చేసి మాదిగల కవాతుకు సన్నహద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ ధర్మపురి అరవింద్ గెలుపులో ఎంఆర్పిఎస్ పాత్ర, మాదిగల పాత్ర ఉన్నందుకు గర్వపడుతున్నామని అన్నారు. సమావేశంలో ఎంఆర్పిఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, ఆర్మూర్ నియోజకవర్గ ఇంఛార్జి మైలారం బాలు మాదిగ, నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు రొద్ద ప్రవీణ్ మాదిగ, ఎంఎస్పి జాతీయ నాయకులు మానికోళ్ళ గంగాధర్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు యమున మాదిగ, సత్తెక్క మాదిగ, ఎంఆర్పిఎస్ జిల్లా కార్యదర్శి సుమన్ మాదిగ, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు పద్మ, సావిత్రి, మునిరా, నిజామాబాద్ టౌన్ నాయకులు మహేష్ మాదిగ, జిల్లా నాయకులు యధసి శ్రీరాములు మాదిగ, రాంచందర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

10నుండి యధావిధిగా ప్రజావాణి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10 నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ఎలక్షన్స్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వ ఉద్యోగినులకు వసతి గృహం, ఓల్డ్ యన్‌జిఓస్, కాలనీ, సుభాష్ నగర్, నిజామాబాద్ నందు ప్రారంభమైందని, ఆసక్తి గల ఉద్యోగినులు, విద్యార్థినుల ఈ వసతి గృహంలో ఉండుటకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు శుక్రవారం తెలిపారు. ఇది పూర్తిగా నెలవారి చెల్లింపుతో నడుపబడును. తదుపరి వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 9603925140కు సంప్రదించాలని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, మహిళా ఉద్యోగినులు వసతి గృహం సూపరింటెండెంట్ రసూల్ బీ పేర్కొన్నారు.

బీసీల దామాషా ప్రకారం రిజర్వేషన్‌కోసం ఉద్యమించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న బిఎల్ఎఫ్ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కోసం ఉద్యమించాలని బీఎల్ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బిఎల్ఎఫ్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, ప్రముఖ డాక్టర్ కె.కేశవులు, ప్రముఖ న్యాయవాది బాస రాజేశ్వర్, జమాతే ఇస్లామిక్ హింద్ జిల్లా కన్వీనర్ ఎస్.కె. హుస్సేన్, బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటి సభ్యులు మైత్రి రాజశేఖర్, సబ్బని లత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే కుల, జనగణన నిర్వహించిన అనంతరమే బిసి కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంలో నూటికి 65 శాతం ఉన్న బీసీ సమాజానికి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

బిసి కులాల జనాభా దామాషా ప్రకారం.. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చిన బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకత్వానికి ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కె. కేశవులు, ప్రముఖ న్యాయవాది బీసీ సీనియర్ ఉద్యమకారులు బాస రాజేశ్వర్ అభినందనలు తెలిపారు. బీసీ రిజర్వేషన్ అమలు కావాలంటే బీఎల్ఎఫ్ లాంటి స్పష్టమైన సామాజిక న్యాయ దృక్పథంతో ఉద్యమించే సంస్థకు మాత్రమే సాధ్యమవుతుందన్నారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ మాట్లాడుతూ.. కుల జనగణన బిసి కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. బిసి కులాలకు ఐదు సంవత్సరాలకుగానూ లక్ష కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపుకు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం విధివిధానాలు రూపొందించాలని అన్నారు. జూన్ 7నుండి జూలై 4 దొడ్డి కొమురయ్య వర్ధంతి మేరకు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించిన అనంతరం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఈ పోరాటానికి బీసీ సమాజం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిఎల్పి రాష్ట్ర కమిటి సభ్యులు అబ్బగోని అశోక్ గౌడ్, బీఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్ లు కె. శ్రీనివాస్, వివిధ బిసి కులాలకు చెందిన నాయకులు సిద్ధయ్య, ఓం శంకర్, ఆర్.నర్సింహులు, దండు జ్యోతి, జన్నెపల్లి సత్యనారాయణ, సుభాష్, శ్రీనివాస్, గీతాంజలి, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు ఢీ.. ఒకరు మృతి

నవతెలంగాణ-మోర్తాడ్



మండల కేంద్రమైన రైల్వే స్టేషన్ పరిధిలో గూడ్స్ రైలు ఢీకొని ఒకరు మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ హనుమాన్లు తెలిపారు. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్‌కు చెందిన పాల్ది సంతోష్ (20) తన స్నేహితుడితో ఉదయం సమయంలో పట్టాలపై వెళ్తుండగా నిజామాబాద్ నుండి కరీంనగర్ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో సంతోష్ మృతి చెందినట్లు తెలిపారు. గూడ్స్ రైలును గమనించకపోవడంతో సంతోష్ కాలికి బలమైన గాయాలు మృతి చెందగా అతని స్నేహితుడు గాయాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎవరు కూడా పట్టాలపై నడవడం గాని మద్యం సేవించడం లాంటి పనులు చేయకూడదని తెలిపారు. కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాం మార్పు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- తహసిల్దార్ కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రస్తుతం ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని మారుస్తూ, ఆ స్థానంలో కొత్త చిహ్నాం తీసుకురావాలని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు కైలాస మహారాజ్ అన్నారు. శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాం మార్పు నిర్ణయానికి మద్దతిస్తూ ధర్మ సమాజ్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కైలాస మహారాజ్ మాట్లాడుతూ వివిధ పార్టీల నుండి, సంస్థల నుండి కూడా ప్రతిపాదనలు స్వీకరిస్తుందని ప్రభుత్వం పేర్కొనడం హర్షనీయమన్నారు.అందులో భాగంగానే ధర్మ సమాజ్ పార్టీ నుండి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఒక చిహ్నాన్ని ప్రతిపాదిస్తున్నామన్నారు. మేము ప్రతిపాదిస్తున్న ఈ చిహ్నాంలోని గొప్పతనం ఏమిటంటే ప్రపంచంలోనే ప్రసిద్ధి గాంచిన ఉస్మానియా యూనివర్సిటీని, దాని నుండి గౌరవ డాక్టరేట్ తీసుకున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ని ఈ చిహ్నాంలో ఉంచినట్లు తెలిపారు. ఇది మన తెలంగాణ ప్రజలు గర్వించదగ్గ ఎంతో గంభీరమైన విషయమన్నారు. అగ్రవర్ణ భూస్వామ్య పాలకవర్గంపై అణగారిన వర్గాల రాజ్యం కోసం, హక్కుల కోసం యుద్ధం చేసిన పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న సమ్మక్క సారలక్కల చిత్రాలను కూడా ఈ తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదిత చిహ్నాంలో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదిత చిహ్నాంలో ఉంచిన ఈ ఆరు చిత్రాలు సమాజంలో సమానత్వ భావనని, పీడిత వర్గాల యోధుల పోరాట స్ఫూర్తి కనిపిస్తుందని, భావి తరాల తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి అవుతుందన్నారు. తెలంగాణ వైభవో పేతమైన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అవుతుందని తెలిపారు. ఈ చిహ్నాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందు ధర్మ సమాజ్ పార్టీ తరపున ప్రతిపాదిస్తున్నామన్నారు. తప్పకుండా దీనిని ఆమోదించి ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల పట్ల సమానత్వ భావన ఉందని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు కైలాస్ మహారాజ్, నాయకులు మోహన్ మహారాజు, శంకర్ మహారాజు, సాగర్ మహారాజు, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ ఎమ్మెల్యేను కలిసిన ఎంపిపి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ ఎంపీపీగా నూతనంగా నియమింపబడిన ఎంపీపీ టేకులపల్లి వినీత శుక్రవారం మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని, కామారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదర్ శోభను, జిల్లా కలెక్టర్ వి జితేష్ పాటిల్ కలిశారు. నూతనంగా ఎంపీపీ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా వారిని కలిసినట్టు ఆమె తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని వారు సూచించారు. ఆమె వెంట నాగిరెడ్డిపేట్ జెడ్పిటిసి సభ్యుడు ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి, నాయకులు దుర్గారెడ్డి ఉన్నారు.

జాకోరాలో అంగన్‌వాడీ బాట



అంగన్‌వాడీ బాటలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో రెండున్నర సంత్సరాల పిల్లలను నమోదు చేసుకున్నట్టు మమత తెలిపారు. అంగన్వాడీ సెంటర్‌లో అందించే పౌష్టికాహారంతో పాటు, పిల్లల చదువు, ఆటపాటల గురించి వివరించారు. ఆమెతో పాటు అంగన్వాడీ టీచర్స్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు చదువులు వద్దు..

- బడిబాటలో ఉపాధ్యాయులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ప్రయివేటు చదువులు వద్దు అని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

మద్నూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వ చదువుల పట్ల అవగాహన కల్పించారు. ప్రైవేట్ చదువులు వద్దు.. ప్రభుత్వ చదువులే ముద్దు అంటూ విద్యార్థులకు ప్రభుత్వ సౌకర్యాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారుతి, చంద్రశేఖర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాటలో పాల్గొన్న ఎంపీడీవో..

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని ఎంపీడీవో పర్భన్న పరిశీలించారు. ఈ సందర్భంగా బంజారా గ్రామంలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు.. నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 19వ తేదీ వరకు మండలంలో బడిబాట కార్యక్రమం కొనసాగనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో బంజారా పంచాయతీ కార్యదర్శి మమత గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.



మద్నూర్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



ఎడపల్లి : అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట..

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలలో పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. మండలంలోని అయ్యపల్లి, లింగంపల్లి, సజ్జనపల్లి, శెట్పల్లి సంగారెడ్డి, జల్దిపల్లి, నల్లమడుగు, కోమటిపల్లితో పాటు ఆయా గ్రామాలలోని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ముందస్తుగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అడ్మిషన్లు ప్రారంభమవుతున్నాయని వారన్నారు. కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యాబోధన చేపట్టనున్నట్టు వివరించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అయ్యపల్లో బడిబాటలో భాగంగా ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రజనీకాంత్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. అయ్యప్పపల్లిలోని ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలో అడ్మిషన్ చేయించాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు కోరారు. అందుకు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి ముందుకు వచ్చారు.

రెంజల్ : మండలంలోని దూపల్లి ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ దేవమ్మ, పిఆర్టియూ మండల ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు పరమేశ్వర్, ప్రభాకర్, శ్రీధర్, రాధా, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు విజయరాణి ఆధ్వర్యంలో అంగన్వాడి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి ఉపాధ్యాయులతో పాటు ఆమె గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ మూడు సంవత్సరాలు నిండిన బాల బాలికలందరూ అంగన్వాడి కేంద్రాల్లో తప్పకుండా పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అంగన్వాడి కేంద్రంలో నాణ్యమైన భోజనాలతోపాటు పౌష్టికాహారాన్ని అంగన్వాడి ఉపాధ్యాయులు అందజేస్తారని ఆమె తెలిపారు. చిన్నారి బాలబాలికల్లో రక్తహీనత తక్కువగా ఉంటే ప్రత్యేక ఆరోగ్య పరీక్ష నిర్వహించి, పిల్లల ఆరోగ్యం కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జానకంపేట అంగన్వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ : ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



లింగంపేట్‌లో..



నాగిరెడ్డిపేట్‌లో..

కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- పబ్లిక్ హెల్త్ అధికారి కృష్ణ వేణి



సూచనలు చేస్తున్న అధికారి కృష్ణవేణి

నవతెలంగాణ-వర్ని

మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ సెంటర్‌లలో కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని పబ్లిక్ హెల్త్ అధికారి కృష్ణవేణి అన్నారు. శుక్రవారం మండలంలోని జాలాల్‌పూర్ గ్రామంలోని క్లీనిక్ సెంటర్‌లో పబ్లిక్ హెల్త్ అధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీ, పీఎంపీలుగా మండలంలో నడుపుతున్న 32 సెంటర్‌లలో తనిఖీలు చేశారు. క్లీనిక్ సెంటర్‌లలో ఎలాంటి వైద్యం చేయవద్దని స్థానిక ఆర్‌ఎంపీ, పిఎంపీలను ఆదేశించారు. 32 సెంటర్‌లలో ఎంబీబీఎస్‌గా ఒకరు, మరో ఇద్దరికీ మాత్రమే ప్రభుత్వ వైద్య శాఖ నుంచి సర్టిఫికెట్ ఉన్నాయని పేర్కొన్నారు. మిగతా వాటికి ఎలాంటి ప్రభుత్వ సర్టిఫికెట్లు లేవని పాస్ట్ క్లినిక్ సెంటర్లను వారి యూనియన్‌ల అనుమతులతో నడుపుతున్నారని అన్నారు. అనుమతులు డీఎంఅండ్‌హెచ్ నుంచి తీసుకోవాలని ఆదేశించారు. మెడికల్ షాప్‌లతో లింక్ ఉంటే మాత్రం కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఆమె వెంట వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులున్నారు.

మండలంలో ఘనంగా మృగశిర కార్తె



ఎడపల్లిలో చేపల విక్రయం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో శుక్రవారం ఆనవాయితీగా వస్తున్న మృగశిర కార్తె పండగను మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేపల భారీ ఎత్తున అనేక ఇబ్బందులు పడ్డారు. మంగళ్‌పాడ్ చెరువులో, బ్రాహ్మణపల్లి, జానకంపేట్ (అలీసాగర్), ధర్మారం, కుర్నాపల్లి గ్రామాల్లోని గంగపుత్రులు చేపలు పట్టుకొని గ్రామ ప్రధాన రోడ్డు పక్కన విక్రయించారు. కిలోకు సుమారు రూ.120 ధర పలికింది. ఇతర చోట్ల చేపలకు భలే డిమాండ్‌తో కూడిన ధర పలికింది. అయినప్పటికీ మృగశిర కార్తె పండగను ఆనవాయితీగా వస్తున్న నేపథ్యంలో చేపలను కొనుగోలు చేశారు.

నీట్‌లో మెరిసిన బస్సు కండక్టర్ కొడుకు

నవతెలంగాణ-నసురుల్లాబాద్



సాయికార్తీక్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

ఇటీవల నిర్వహించిన 2024 నీట్ అఖిలభారత వైద్య పరిషత్ ప్రవేశ పరీక్షల్లో టీజీఎస్ ఆర్టీసీ బాన్సువాడ డిపో కండక్టర్ గురుడు అంబాజీ కుమారుడు గురుడు సాయికార్తీక్ నీట్ పరీక్షలో 547 మార్కులు సాధించాడు. 720 మార్కులకు గానూ సాయి కార్తీక్ 547 మార్కులు సాధించాడు. సాయి కార్తీక్ బాన్సువాడ మండలం కొత్తబాది ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పాఠశాల విద్యను, హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాడు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం దామరంచ గ్రామానికి చెందిన అంబాజీ, పద్మావతి దంపతుల ఏకైక కుమారుడు సాయి బాన్సువాడలో తండ్రి బస్సు కండక్టర్ గానూ విరామ సమయంలో బాన్సువాడ పట్టణంలో నాయీ బ్రాహ్మణ మంగళి వృత్తి చేస్తూ కుమారుడిని చదివించారు. ఈ సంవత్సరం నీట్ పరీక్షలో ఉత్తీర్ణత పొంది బాన్సువాడ పట్టణంలో ఆదర్శంగా నిలిచాడు. పలువురు విద్యార్థిని సన్మానించి అభినందించారు. అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటైన నీట్ మెడికల్ పరీక్షను ఉత్తీర్ణత అవ్వడం అంతా తేలికైనా పని కాదు. విద్యార్థి సాధించగలను అనే దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించాడు. తండ్రికి తోడుగా నాయీ బ్రాహ్మణ మంగళి వృత్తి చేస్తూ నీట్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.

నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు



పూర్తికాని రోడ్డు పనులు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రం నుంచి మహారాష్ట్ర, మద్నూర్ వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఎన్నికలకు ముందే ప్రారంభించినప్పటికీ.. ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు. రహదారి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య..?

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ శివారులోని అవాజ్‌గుట్ట వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగల్‌గావ్ గ్రామానికి చెందిన పశువుల కాపరి పశువులు కాచుకుంచు వెళ్తున్న క్రమంలో గుట్ట వద్ద వ్యక్తి ఉరేసుకుని ఉండడాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందజేశాడు. గ్రామస్తులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. కాగా వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడా..? లేదా ఎవరైనా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు రెండు గంటల పాటు కరెంట్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని కోటగిరి సబ్ స్టేషన్ పరిధిలో గల కోటగిరి, ఎత్తొండ, గ్రామాల విద్యుత్ వినియోగదారులకు రెండవ శనివారం 8.06.2024న సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సాయంత్రం 4 నుంచి 6 వరకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని ఏఈ నాయని కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత

నవతెలంగాణ-పిట్లం

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాతపడింది. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గొల్ల రాజేందర్‌కు చెందిన గేదె విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. పిట్లం గ్రామ శివారులోని ఊర చెరువు కట్టకింద రోజువారీగా తన గేదెలను మేత కోసం తీసుకెళ్లగా గేదెలు మేత మేస్తున్న క్రమంలో పొలంలో గల విద్యుత్ వైరు ఒక గేదె కొమ్ములకు తాకి షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-మద్నూర్



తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ టీమ్ బాన్సువాడ ఏడిఏ వీరాస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని మద్నూర్, మెనూరు గ్రామాల్లో గల విత్తన దుకాణాలను స్థానిక వ్యవసాయాధికారి రాజుతో కలిసి తనిఖీలు చేశారు. ముఖ్యంగా విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెచ్చిన విత్తనాలకు బిల్లు, ఇన్‌వాయిస్, పిసి, స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, లైసెన్సు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తనాలు అమ్మిన వాటికి రసీదు తప్పకుండా ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి డీలర్లను ఆదేశించారు. లూజుగా అమ్మే విత్తనాలను కొనవద్దని వ్యవసాయదారులకు తెలియజేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి రాజు, బాన్సువాడ ఏఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే

- పెస్టిసైడ్ దుకాణ యజమాని హైమద్

నవతెలంగాణ-ఎడపల్లి



బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న పలువురు

ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి బదిలీలు సహజమేనని ఎడపల్లికి చెందిన కిషన్ ఆగ్రో పెస్టిసైడ్ దుకాణ యజమాని హైమద్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో గల కెనరా బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సునీల్ కుమార్ తో పాటు ఫీల్డ్ ఆఫీసర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన, కెనరా బ్యాంక్ ఖాతాదారులు, రైతులు, నాయకులు బదిలీపై వెళుతున్న అధికారులకు శుక్రవారం కేఎస్ఆర్ బ్యాంకులో ఘనంగా సన్మానించి పూలబొకేను అందజేశారు. ఈ సందర్భంగా హైమద్ మాట్లాడారు. ఇటీవల ఎడపల్లికి బ్యాంకు మేనేజర్‌గా వచ్చిన సునీల్ కుమార్ రైతులకు అటు మహిళా డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎనలేని కృషి చేశారని ఆయన అన్నారు. కెనరా బ్యాంకులో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటి సమస్య అప్పుడే పరిష్కరించడానికి బ్యాంక్ అధికారుల చేస్తున్న సేవలు హర్షనీయమని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్ ఎక్కడ విధులు నిర్వహించిన రైతులకు అందుబాటులో ఉంటూ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. రైతులు పోల లింగారెడ్డి, చిరు వ్యాపారులు కిషోర్ గుప్తా, లింగేష్ గుప్తా, జడ్పీ ఉపాధ్యక్షు రాలు క్రిస్తవ ఎల్లయ్య యాదవ్, వినోస్, ఎడపల్లి పిఎసిఎస్ డైరెక్టర్ రాముల నాయక్, బుజ్జి, గంగాధర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో తుకారం రాథోడ్
- కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

నవతెలంగాణ-కోటగిరి

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని డీఎంఅండ్‌హెచ్‌వో తుకారం రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హాజరు పట్టిక, వాక్సిన్ భద్రపరిచే ఫ్రీజ్‌ను పరిశీలించారు. మందుల స్టోర్ పరిశీలన చేసి ఎక్స్‌పైరీ మందులు ఉంచకూడదని తెలిపారు. కుక్క కాటు, పాము కాటు ఇంజక్షన్ అందుబాటులో ఉండాలని తెలిపారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నందు అందించే అన్ని సేవలు అందచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని, ప్రసవానికి సిద్ధంగా ఉన్నవారి వివరాలు అందుబాటులో ఉంచి ప్రతి నిత్యం మానిటర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సుప్రియ, పీహెచ్‌సీ వైద్యాధికారి కరణ్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సూపర్‌వైజర్ జ్యోతి, సాయికుమారి, ఫార్మసిస్ట్ హిమాంజలి, ఆశ అరుణ పాల్గొన్నారు.



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో తుకారం రాథోడ్

కామారెడ్డి నుంచి ఫిలిం ఫీల్డ్‌కు పరిచయమైన హీరో, డైరెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా నుంచి నూతనంగా ఫిలిం ఫీల్డ్‌కు హీరోగా ఒకరు, డైరెక్టర్ ఒకరు బొంపల్లి హరీష్‌బాబు హీరో డైరెక్టర్ బొంపల్లి విష్ణుబాబు పరిచయమైనట్టు కామారెడ్డికి చెందిన బొంపల్లి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డి నుంచి బొంపల్లి ఫ్యామిలీ నుంచి నూతనంగా పరిచయం అవుతున్న హీరో, డైరెక్టర్‌గా పరిచయం అయినందుకు కుటుంబ సభ్యులు బొంపల్లి ఫ్యామిలీ ఆనందం వ్యక్తం చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఓ సినిమా నూతనంగా సినీ ఫీల్డ్ వచ్చేవాళ్ళ కష్టాలు ఏ విధంగా ఉంటాయో అనేది ఈ సినిమా కథనమని వివరించారు. ఈ సినిమాలో కామెడీ, ఫైట్స్, సెంటిమెంట్స్‌తో డైరెక్టర్ విష్ణు బాబు, హీరో హరీష్ బాబు హీరోయిన్, ఇతర నటీనటులు అద్భుతంగా నటించారని వివరించారు.



మాట్లాడుతున్న బొంపల్లి కుటుంబ సభ్యులు

జోరుగా చేపల విక్రయాలు



నవతెలంగాణ-నందిపేట్
మృగశిర కార్తె(మిరుగు) పండగను పురస్కరించుకుని మత్స్యకారులు చెరువుల్లో చేపలు పట్టి ఆయా గ్రామాల్లో జోరుగా విక్రయాలు కొనసాగించారు. పండగ సందర్భంగా మార్కెట్ లో క్రయ విక్రయాలు పెరిగి చేపలకు డిమాండ్ బాగా పెరిగింది. మృగశిర కార్తె కావడంతో రైతులు వ్యవసాయ భూములను సిద్ధం చేసి పనుల్లో నిమగ్నమయ్యారు.

సీడ్ ఔట్లెట్స్ తనిఖీ చేసిన అధికారులు


విత్తనాల బ్యాగ్‌లను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని ఫెస్టి సైడ్ షాప్‌లో గల విత్తనాల కాలపరిమితిని మండల తహశీల్దార్ షబ్బీర్, వ్యవసాయ అధికారిని పద్మ ఎస్సై సుదీర్ రావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అందరికి లైసెన్సు లు ఉన్నాయా.. నకిలీ విత్తనాలు ఉన్నాయా.. రైతుకు బిల్లు ఇస్తున్నారా.. లేదా..అని పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు.

10 వాహనాలు సీజ్


సీజ్‌చేసిన ద్విచక్ర వాహనాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి, జక్రాన్‌పల్లి ఎస్ఐ, సిబ్బంది ఆధ్వర్యంలో మండల పరిధిలో గల గాంధీ నగర్‌లో నెంబర్ ప్లేట్ లేని, మైనర్ డ్రైవింగ్ వాహనాలకోసం శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 10 వాహనాలను సీజ్ చేసి, జరిమానా విధించామని ఎస్ఐ తిరుపతి తెలిపారు. వాహనదారులందరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్, ఫిట్నెస్, ఇన్సూరెన్స్ తప్పక కలిగి ఉండాలని తెలియజేశారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు వితరణ


తోపుడు బండి అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్
రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పట్వారి గోపికృష్ణ అధ్యక్షతన రోటరీ పిడిజి హనుమంత్ రెడ్డి తండ్రి నల్ల వెంకట్ రెడ్డి స్మారకార్థం శుక్రవారం చిరు వ్యాపారులకు లక్షా60వేల విలువ గల 10 తోపుడు బండ్లనీ వితరణ చేశారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి కోసం చిరు వ్యాపారాలు చేసుకుంటున్న సొంతగా బండి లేని వారికి తమ వంతు సహకారం అందించడానికి పది తోపుడుబండ్లని వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారీ గోపికృష్ణ మాట్లాడుతూ మా వంతు రోటరీ సేవలు ఎల్లప్పుడూ అందిస్తామని, హనుమంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీనారాయణ,కాంతి గంగారెడ్డి ,విజయసారథి, చరణ్ రెడ్డి, పద్మ మురళి, పుష్కర్ రావు, రాజేందర్, రాం ప్రసాద్,ఆనంద్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు

చిన్నారులకు సర్టిఫికెట్ల అందజేత

- నటరాజ నృత్యానికేతన్‌లో ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్లు అందుకుంటున్న చిన్నారి

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలో గల నటరాజ నృత్యానికేతన్‌లో శుక్రవారం చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత మాడవేడి నారాయణ మాట్లాడుతూ గత నెల రోజుల నుండి వేసవి సెలవులలో చిన్నారులకు నాట్య శిక్షణలో మెలకువలు నేర్పించిన నాట్య గురువు భాశెట్టి మృణాళిని సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మిమిక్రీ కళాకారులు కోకిల నాగరాజు, నాట్య గురువు మృణాళిని, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన భూముల్లో మట్టిని తొలగించాలి

- కబ్జాదారులకు నోటీసులు అందజేత


చెరువు భూమిని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలోని పెద్దచెరువుకు ఆనుకొని కొందరు కబ్జాలు చేసి మట్టి వేసి సాగు చేసుకుంటున్నారనే ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ శాఖ ఏఈ మాదవి, మండల రెవెన్యూ అధికారి మోహన్, ఎంపిటిసి మారంపల్లి సుధాకర్‌తోపాటు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఇతరులతో కలిసి శుక్రవారం చెరువును, అక్రమాలకు గురైన భూములను పరిశీలించి చెరువు భూములను కబ్జా చేసిన వారికి నోటీసులను అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువుకు ఆనుకొని ఉన్న వారు కొందరు భూములను ఆక్రమించారని అన్నారు. వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ భూములను అధికారులతో కలిసి పరిశీలించగా కబ్జాకు గురైన మాట వాస్తవమేనని అన్నారు. ఈ సందర్భంగా కబ్జా చేసినవారికి నోటీసులను అందజేశామని ఎక్కడైతే చెరువు భూమిని కబ్జా చేసి మట్టివేసి అభివృద్ధి చేశారో గతంలాగా యధావిధిగా ఉంచాలని అన్నారు. లేకపోతే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు ఇచ్చిన నోటీసులో హెచ్చరించారు.

ఇసుక, మొరం అక్రమ రవాణాను ఆపరెందుకు?

- సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన ఎంపీపీ
- ఎంపీటీసీ మీనా పేరు 11 కెవి మీనాగా మారింది
- ఐదేళ్లలో సర్వసభ్య సమావేశంతో ఒక్క సమస్య పరిష్కారం కాలేదని సభ్యుల ఆవేదన


మండల సమావేశంలో సమస్యలపై మాట్లాడుతున్న సభ్యులు

నవతెలంగాణ-నవీపేట్
మండలంలో రాత్రింబవళ్లు ఇసుక, మొరం దందా జోరుగా జరుగుతున్న రెవెన్యూ అధికారులు ఆపరెందుకని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ ఎమ్మార్వో నారాయణను సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని ఇకనుండయినా దృష్టి సారించాలని కోరారు. తమకు గ్రామాల్లో వీఆర్ఏలు లేని కారణంగా అడ్డుకోలేకపోతున్నామని, మైనింగ్ అధికారులకు లేదా 100 నెంబర్‌కు సమాచారం ఇస్తే అడ్డుకోవచ్చని ఎమ్మార్వో తెలిపారు. గతంలో మన ఊరు మనబడి పనులు చేపట్టిన ఇప్పటికీ బిల్లులు రాలేదని ఎంఈఓ గణేష్ రావును ఎంపీటీసీ కృష్ణమోహన్ నిలదీశారు. సంవత్సరాల తరబడి బిల్లులు ఇవ్వకపోతే కాంట్రాక్టర్లకు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మన ఊరు మన బడి కార్యక్రమానికి బదులుగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం వచ్చిందని అన్నారు. తాము చేసిన పనుల కమిటీ రద్దు చేశారని చెక్ పవర్ ఎవరికి వస్తుందో అయోమయ పరిస్థితిలో కాంట్రాక్టర్లు గందరగోళంలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు నందిగాం నాయకులు దవాడే సంజీవ్ పెండింగ్‌లో ఉన్న నలభై లక్షల బిల్లును వెంటనే మంజూరు చేయాలని ఎంపీపీ, ఎంపీడీవోలకు వినతిపత్రం అందించారు.

ఎంపీటీసీ మీనా పేరు 11 కేవీ మీనాగా మారింది..

తాను ఎంపీటీసీగా పదవి బాధ్యతలు చేపట్టి మొట్టమొదటి సమావేశంలో సుభాష్ నగర్ లో గల 11 కెవి విద్యుత్ స్తంభాలు ఇండ్లలో అతి ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని తొలగించాలని ఐదేళ్లుగా ప్రతి సర్వసభ్య సమావేశంలో ట్రాన్స్కో అధికారుల దృష్టికి తీసుకువచ్చానని, దీంతో తన పేరు ఎంపీటీసీ మీనాగా కాకుండా 11 కెవి మీనాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి సమావేశం కావడంతో ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. తాము ఐదేళ్లలో సర్వ సభ్య సమావేశంలో సభ దృష్టికి తీసుకువచ్చినా ఏ ఒక్క సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికైనా ఐదేళ్లలో విన్నవించిన సమస్యల జాబితాలా వినతి పత్రాన్ని ఎంపీపీ, ఎంపీడీవోలకు అందించి పరిష్కరించాలని కోరారు. సర్వసభ్య సమావేశంలో ఐదేళ్లలో ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేక పోయామని ప్రజలకు తాము ఏమి సమాధానం చెప్పుకోవాలని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓ గణేష్ రావు నూతన పాఠ్యపుస్తకాలను ఎంపీపీ, ఎంపీడీవోల ద్వారా అందించారు. అనంతరం ఐకెపి మహిళా సంఘాలతో కుట్టిన విద్యార్థుల యూనిఫామ్ లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, జడ్పిటిసి సవిత, వైస్ ఎంపీపీ ఇందూర్ హరీష్, ఎంపీటీసీలు సతీష్, సాయిలు, రాధ, జనార్ధన్, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

బడిబాటలో అందరూ భాగస్వాములు కావాలి

- ఎంపీడీవో సంతోష్ కుమార్


మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్
ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ స్వామితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. 5 సంవత్సరలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాల ల్లో చేర్పించాలని, డ్రాపౌట్ పిల్లలు లేకుండా బడిమానేసిన పిల్లల ను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బుక్స్, నోట్ బుక్స్ యూనిఫామ్‌లు మధ్యాహ్నం భోజనం గురించి ప్రజలల్లో అవగాహన కలిపించాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని అన్నారు, ఈకార్యక్రమం లో ఎం ఈ ఓ డీ స్వామి, ఎస్సై హరిబాబు, ఏపీఎం రవీందర్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీనివాస్, అనురాధ, సిఆర్‌పిలు బాలరాజు సంతోష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రమాదేవి, శారద, హాస్టల్ వార్డెన్ లక్ష్మణ్, రవీందర్, నవనీత, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

స్కూల్ యునిఫాంలు పంపిణీ

నవతెలంగాణ - మెండోర
మండలంలోని ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్‌లను మహిళ సంఘాల ద్వారా మొత్తం 2481 విద్యార్థులు ఉండగా ఇప్పటివరకు 1462 మంది విద్యార్థులకు యూనిఫామ్స్‌ని కుట్టించి బడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులకు అందించారు. మెండోర జెడ్‌పిహెచ్‌ఎస్, ఎంపీపీస్, ప్రధానోపాధ్యాయులకు స్కూల్ యునిఫాంలు అందించారు. కార్యక్రమంలో ఎఎపిసి సభ్యులు, ఏపియం విక్రమ్ రెడ్డి , పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



పిల్లల్ని ప్రభుత్వ బడిలోనే చేర్పించాలి

- రెండోరోజు బడిబాట

నవతెలంగాణ-విలేకరులు


కమ్మర్‌పల్లి : బషీరాబాద్‌లో..


మోపాల్ మండలంలో..

కమ్మర్‌పల్లి : తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని బషీరాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.గంగాధర్‌తో తెలిసి బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలతో ముద్రించిన కరపత్రాలను ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ గౌడ్, నాయకులు ఎస్.రమేష్, సక్కారం నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండలంలోని మగ్గిడి హైస్కూల్ పాఠశాల హెచ్‌ఎం హరిత శుక్రవారం తెలిపారు. గవర్నమెంట్ పాఠశాలలో చదివే విధంగా తల్లిదండ్రులను ప్రోత్సహిస్తూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

జక్రాన్‌పల్లి: ఉపాధి కూలీల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పాలని ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తొర్లికొండ గ్రామంలోని ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. అక్కడ పని చేస్తున్న కూలీలకు వారి పిల్లల్ని ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా పాఠశాలల్లోని సదుపాయాలు, నాణ్యమైన విద్య గురించి తెలియజేశారు. వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చేర్పినట్లయితే నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు నోట్బుక్లు మధ్యాహ్న భోజనం ఉదయం పూట రాగి జావ కంప్యూటర్ విద్య అందించడం జరుగుతుందని వివరించారు. పిల్లలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాస్ స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగమ్ అశోక్ విడీసీ సభ్యులు లింగారెడ్డి, మహిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


ఆర్మూర్ : మగ్గిడిలో..

మోపాల్: మండల పరిధిలోగల న్యాల్కల్, కులాస్పూర్ గ్రామాల్లో అంగన్వాడి బడిబాట కార్యక్రమం మరియు చిన్నపిల్లలతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్ రజిత సూపర్ వైజార్ జాకీర చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా చిన్న పిల్లలకు అంగన్వాడి సెంటర్లో చదువుతోపాటు ఆటపాటలు నేర్పించడం జరుగుతుందని. వారికి అంగన్వాడి పాఠశాలలోనే పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. కచ్చితంగా ప్రతి తల్లిదండ్రి అంగన్వాడి పాఠశాలలోనే తమ పిల్లల్ని పంపించాలనీ అనవసరంగా అత్యదిక ఫీజులు కట్టి ఆర్థిక ఇబ్బందుల్లో పడవద్దని వారు తల్లితండ్రులకు విజ్ఞప్తి చేశారు.


జక్రాన్‌పల్లిలో..

బాల్కొండ : మండల కేంద్రంలోని నెహ్రూనగర్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు బడిబాట ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతూ బడి బయట పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాలలో చేరే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మౌనిక, అంగన్వాడీ టీచర్ సునీత తదితరులు పాల్గొన్నారు.


బాల్కొండలో..

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

- ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి

నవతెలంగాణ-రెంజల్

అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని, వారి ఎత్తు బరువులను గమనించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కళ్యాపూర్ గ్రామంలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి బడిబాట కార్యక్రమంలో గ్రామంలో పర్యటించారు. మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని, ఐదు సంవత్సరాలు పైబడిన వారికి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి అంగన్వాడి టీచర్లు సహకరించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో న్యూట్రీ గార్డెన్లను ఏర్పాటు చేసుకొని ఆకుకూరలు కాయగూరలను పండించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, పిల్లల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

రెండవ రోజు కొనసాగిన బడిబాట

నవతెలంగాణ-బోధన్


వివరాలు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

బడిబాట కార్యక్రమం శుక్రవారం రెండవ రోజు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బోధన్ పట్టణంలోని రాకాసిపేట హాబిటేషన్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట్(జేసీ) ఉపాధ్యాయులు కాలనీలలో తిరుగుతూ విద్యార్థుల తల్లితండ్రులను కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వివరించారు. అలాగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను వివరించారు. శుక్రవారం బడిబాటలో భాగంగా 6 వ తరగతిలో 10 మంది , 9వ తరగతిలో ఒకరు, పదవ తరగతిలో ఒకరిని నమోదు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమిత్ కుమార్, నగేష్ బాబు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీని

విజయవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్


పాల్గొన్న అధికారులు

ఈనెల 9న జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతంగా పూర్తి చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం టీజీపీఎస్సీ గ్రూప్ -1 పరీక్ష నిర్వహణ కోసం అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే అధికారులు వాటిని పరిశీలించాలని తెలిపారు. ఈ నెల 9న ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మహిళలకు, పురుషులకు వేరువేరు తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో కావలసిన అన్ని రకాల సదుపాయాలను కల్పించామని చెప్పారు. దివ్యాంగులకు కావలసిన స్క్రైబ్లను ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులకు గ్రౌండ్‌ఫ్లోర్‌లో అలాట్మెంట్ చేయాలని సూచించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇప్పిచ్చామన్నారు. ఇన్విజిలేటర్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయాలన్నారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావొద్దని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలలో మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు లేకపోతే ఏదైనా గుర్తింపు కార్డు పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకురావచ్చునని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రానికి ప్రశ్నపత్రాలు, తిరిగి పరీక్ష కేంద్రానికి జవాబు పత్రాలు రిసెప్షన్ సెంటర్‌కు తరలించడంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్ష రోజు ఇన్విజిలేటర్లు ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలని, ఓఎంఆర్ షీట్స్ అభ్యర్థులకిచ్చి జాగ్రత్తగా నింపే విధంగా చూడాలన్నారు. పరీక్ష కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఎవరూ సెల్‌ఫోన్ వాడకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథరావు, జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు రాజారాం, వరదారెడ్డి, దయానంద్, సతీష్ కుమార్ భాగ్యలక్ష్మి, పరీక్షల విభాగం పర్యవేక్షకురాలు జ్యోతి, బయోమెట్రిక్ శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రైతులు విత్తనాలు ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని ఏఈఓ ముఖీద్ అన్నారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతుల అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రైతులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని, రైతులెవరూ లూజుగా (ప్యాకింగ్ లేని) ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుక్కోకూడదని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సంబంధించి తప్పకుండా రసీదు తీసుకోవాలని, వాటిని పంటకాలం పూర్తి అయ్యేవరకు భద్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల పరిధిలోని ఎర్రమనుకుచ్చా, హౌసింగ్ బోర్డ్, సాతెలి బేస్ ప్రాంత రైతులు గాదే సత్తయ్య, మంద్రు లక్ష్మయ్య, నర్సింలు, పోశెట్టి వెంకన్న, లక్ష్మణ్, తోట అంజయ్య, పప్పు రాములు, ఆకుల రవి, రామచందర్, సల్ల వెంకటేశం, ఎడ్ల కిషన్, మంత్రి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు యజమాన్యాలపై చర్యలు తీసుకోండి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రయివేటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టిఎస్‌వి ఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఆర్డీవో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని ప్రైవేట్ విద్యాసంస్థలు స్కూల్ బస్సులను ఫిట్‌నెస్ లేకుండా పెళ్లిళ్లకు, పార్టీ మీటింగ్‌లకు వారి సొంత అవసరాలకు వాడుకుంటున్నారని అన్నారు. ఇదే తరహాలో నందిపేట్‌లో ఒక హై స్కూల్ యాజమాన్యం వారి పరిమితికి మించి స్కూల్ బస్‌ని పెళ్లికి దాదాపు 60 కిలో మీటర్లు దూరం బస్‌ని పంపించడం ప్రభుత్వ నియమాలకు విరుద్ధం అని అన్నారు. ఆ పాఠశాలపై చర్యలు తీసుకుని బస్‌ను వెంటనే సీజ్ చెయ్యాలని తెలిపారు.

శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో మహాయజ్ఞం

నవతెలంగాణ-మోపాల్

బోర్గాం (పి)శివారులోగల శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో మూడు రోజుల యజ్ఞ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం శ్రీ సూక్త సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం ప్రారంభమైంది. శృంగేరి శ్రీ శారదా పీఠాధిశ్వర్లు భారతి తీర్థ స్వామి, విదుశేఖర భారతి తీర్థమహాస్వాముల ఆశీస్సులతో తొలి రోజు పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తులకు అన్నదానం చేసినట్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు అరుణ్ కుమార్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ చెట్టి శ్రీనివాస్ గాజవాడ ఆగమయ్య చిట్టి మిల్లి హరిప్రసాద్ గజవాడనరేందర్ పవన్ కేడియా గజవాడ ధర్మరాజు, భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో మిరుగు సత్రం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మిరుగు సత్రం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద మిరుగు సత్రం పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రుద్ర రాజేశ్వర్, గాండ్ల శ్రీనివాస్, అల్లెం అశోక్, గురాయి మహిపాల్, గోసం సాయిరాం, వడ్ల మహేష్, నరసింహ రెడ్డి, ఎస్ఆర్‌ఐ అధ్యక్షుడు బట్టు స్వామి, ఉపాధ్యక్షుడు గురయి రాజేందర్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొల్లి ప్యాక్ గ్రామంలో మహిళ గ్రామ సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాబు మాట్లాడుతూ బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో చెల్లించి ప్రభుత్వ వడ్డీ రాయితీ పొందాలన్నారు. టైలరింగ్ ఉన్న ప్రతి ఒక్క మహిళ ఏకరూప దుస్తులు కుట్టించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా గ్రామ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయికి నీట్‌లో ర్యాంక్

- ఇబ్రహీంపేట్ ఆణిముత్యానికి సన్మానం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన తబస్సుమ్ నీట్ పరీక్షలో 591 మార్కులు సాధించడంతో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన ఖలీద్ బిన్ అలీ కూతురైన తబుస్సుం ఇటీవల విడుదలైన అఖిల భారత వైద్య విద్య పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించినందుకు గానూ శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఆమెను శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదింటి కుటుంబానికి చెందిన అమ్మాయి వైద్య విద్య పరీక్ష ఫలితాల్లో రాణించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, కిసాన్ కేత్ జిల్లా మాజీ అధ్యక్షులు ఉద్దెర హన్మాండ్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండి సాయిలు యాదవ్, విట్టల్‌రెడ్డి, అలీ బిన్ అబ్దుల్లా, రఫీక్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్యసమావేశం జరిగింది. ఇందులో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంధ్రయ్య మాట్లాడుతూ...మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమం మొదలైందని, విద్యార్థులకు సరిపోయేటన్ని పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు వచ్చాయని అన్నారు. మండల సమాఖ్య సంఘాలు, ఐకేపీ ద్వారా ఏకరూప దుస్తులు సిద్ధం చేశామని, పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు దుస్తులు అందజేస్తామని అన్నారు. సన్న వడ్లకు బోనస్ ఎప్పుడిస్తారని ఎంపీపీ ఉపేందర్ రెడ్డి వ్యవసాయశాఖ అధికారిని అడగగా.. గవర్నమెంట్ నుండి ఎలాంటి సమాచారం అందలేదని ఆయన సమాధానం ఇచ్చారు. ఏర్గట్ల తీగల వాగు బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు చేపడతారని, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్అండ్‌బి ఏఈ వినిత్‌ను ఎంపీపీ అడగగా వర్షాకాలం అయిపోయిన తర్వాత నిర్మాణం చేపడతామన్నారు. గత ప్రభుత్వంలో తొర్తి డబుల్ రోడ్డు పనుల నిర్మాణానికి ఉత్తర్వులు వచ్చాయని, ప్రస్తుత ప్రభుత్వం దాన్ని రద్దు చేయడం దారుణం అని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, వైస్ ఎంపీపీ సల్ల లావణ్య,ఎంపిటీసీ జక్కని మధుసూదన్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, ఎమ్మార్వో యూసుఫ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు,వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- అర్ఎంపి, పిఎంపిలకు సూచన
- క్లినిక్‌ల తనిఖీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి/నవీపేట్


నవీపేట్ మండలంలో..


డిచ్‌పల్లి మండలంలో..

ఇందల్ వాయి మండలంలో ప్రథమ చికిత్స కేంద్రాలను మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ శుక్రవారం తనిఖీలు చేశారు. ఆర్ఎంపి, పిఎంపి క్లినిక్‌లలో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని వారి పేరు ముందు డాక్టర్ అని పెట్టుకో రాదని ఇన్ పేషెంట్‌గా ఉంచుకోరాదని వారికి ఆదేశించారు. ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని వారు అడిగిన సమాచారం ఇవ్వాలని, ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహిస్తున్న ఆర్ఎంపి పిఎంపిలకు ఆదేశించారు. వారికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులు, డయాగ్నోస్టిక్ సెంటర్లకు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. తిర్మన్ పల్లి గ్రామంలోని ఫిజియోథెరపీ సెంటర్‌ను ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ తనిఖీ చేసి క్లినిక్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను తీసుకున్నారు.

నవీపేట్: మండల కేంద్రంతో పాటు జన్నేపల్లి గ్రామంలో గల ఆర్.ఎం.పి, పి.ఎం.పి క్లినిక్ లను వైద్యులు సామ్రాట్ యాదవ్ వైద్య సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీ నిర్వహించారు. శిక్షణ పొందిన ధ్రువపత్రాలను, వైద్యం చేసే తీరు మరియు సూచించే మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో మండలంలోని అన్ని క్లినిక్ లను తనిఖీ చేసి నివేదికను జిల్లా వైద్యాధికారికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు, కిషన్, ఏఎన్ఎంలు మరియు ఆశలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంకోసం గర్భిణులకు ఇబ్బందులు

- వేరేచోటుకు అంగన్‌వాడీకేంద్రం


వినతిపత్రం అందజేస్తున్న యువకులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తాళ్లరామడుగు గ్రామంలో ఉన్న పాత అంగన్వాడీ సెంటర్ కొనసాగించాలని భీంగల్ ఐసీడీఎస్ అధికారి ప్రసాద్‌కు యువకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని స్కూల్ సమీపంలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌ను గ్రామ శివారులో ఉన్న ఒడ్డెర కాలనీ(రాజన్నపల్లికి)మార్చడంతో గర్భిణీ స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు కిలోమీటర్కుపైగా నడిచి పౌష్టికాహారం తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. గత పక్షం రోజుల నుండి వెళ్తున్నారని వాపోతున్నారు. గ్రామంలోని అంగన్వాడీ టీచర్ కావాలనే సుమారు పదిహేను మంది ఎస్సీ కులానికి చెందిన గర్భిని స్త్రీలను ఇతర ఒడ్డెర కాలనీ సెంటర్‌కు పంపిస్తున్నారని ఆరోపించారు. విచారణ చేసి అంగన్వాడీ టీచర్ చర్యలు తీసుకొని పాత సెంటర్‌ను కొనసాగించాలని కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో రంజీత్ కుమార్, సతీష్, డి. రంజిత్, తదితరులు ఉన్నారు.


వస్తువులు కొనుగోలు చేస్తే బిల్లు తీసుకోవాలి

- ఐఎస్ఐ అగ్‌మార్క్ ఉన్న వస్తువులనే కొనాలి
- మాయామార్ రాజేశ్వర్

నవతెలంగాణ-నిజామాబాద్

రైతు బజార్ సుభాష్ నగర్‌లో ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం శుక్రవారం జిల్లా ఆహార భద్రత అధికారి టి.నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు మాయావార్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. పండ్లు , పాలు, నీరు, తినుబండారాల్లో కల్తీ జరిగినా, కిరాణం, సూపర్ మార్కెట్లు, రిలయన్స్ మార్కెట్లలో కానీ స్మార్ట్ మార్కెట్లలో ఎక్కడైనా కొనేటప్పుడు వినియోగదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పప్పులు, రవ్వ, మైదా వంట నూనెలు ఇతర తినే వస్తువులు తగు జాగ్రత్తలు తీసుకొని వ్యాపారస్తుల నుంచి కొనుగోలు చేయాలని తెలిపారు. ఐఎస్ఐ ఉన్న నీటిని మాత్రమే వాడాలని, నాన్ ఐఎస్ఐ వాటర్ వాడకూడదని, ఐఎస్ఐ అగ్‌మార్క్ ఉన్న వస్తువులనే కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే బిల్లులు తీసుకోవాలని, టిఫిన్ సెంటర్లలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో హెూటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని అన్నారు. గుట్కా, పాన్ మసాలాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని, ఎవరైనా అమ్మితే మున్సిపల్ అధికారులకు కానీ జిల్లా ఆహార భద్రతాధికారులకు గాని తెలియజేయాలని తెలిపారు. వస్తువులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు తీసుకోవాలని కోరారు వినియోగదారులు విడివిగా ఉన్న వస్తువులను కొనుగోలు చేయరాదని ప్యాకెట్ లో ఉన్న సరుకులను మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ మెట్రాలజీ టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్రావు వినియోగదారుల ప్రతినిధులు డి.రమేష్, ఎస్.సత్యనారాయణ, జిల్లా ఆహార భద్రత కార్యాలయ సిబ్బంది వినియోగదారులు పాల్గొన్నారు

ఏకరూప దుస్తులు పంపిణీ


యూనిఫాంలు పంపిణీ చేస్తున్న డీపీఎం, ఏపీఎం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని నాగన్‌పల్లి గ్రామంలో శుక్రవారం మహిళ సమాఖ్య - 1 ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎం రాచయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫామ్స్ కుట్టించి పంపిణీ చేసినట్టు తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు డీఆర్డీఏ పీడీ ఆధ్వర్యంలో 2122 యూనిఫామ్స్ కుట్టించి ఇచ్చినట్టు వివరించారు. అందులో భాగంగా నాగన్‌పల్లి గ్రామంలో 2 ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్‌లకు స్కూల్ యూనిఫామ్స్ అందించినట్లు తెలిపారు. త్వరలో డ్రెస్సులు కుట్టిన మహిళ సంఘాలకు డ్రెస్సుకు రూ.75 చొప్పున డబ్బులు చెల్లించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వినోద్ కుమార్, హెడ్‌మాస్టర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

కూలర్ షాక్ కొట్టి ఆరేళ్ల చిన్నారి మృతి

- 20 రోజుల్లోపే ఇద్దరు

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలూరు మండల కేంద్రంలో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. ఇంట్లో సరదాగా ఆడుకుంటున్న చిన్నారి ఒకసారి విద్యుత్ షాక్‌కు గురై మరణించింది. జిల్లా కేంద్రంలో నివాసం ఉండే మనీష్, సౌందర్య దంపతులు ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరు శుక్రవారం పని నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లడంతో ఇద్దరు కుమార్తెలను ఆలూరులో అమ్మమ్మ లావణ్య ఇంటి వద్ద వదిలి వెళ్లారు. సాయంత్రం పూట ఆడుకుంటున్న చిన్నారుల్లో చిన్న కుమార్తె అయిన సింధూర (6)కూలర్‌ను తాకింది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో చిన్నారికి షాక్ తగిలి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు చిన్నారిని ఆర్మూర్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎప్పుడు సందడిగా గడిపే చిన్నారి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.. కాగా గత నెల 19న పట్టణంలో ఓ చిన్నారి కూలర్‌ను ముట్టుకొని విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వరుస ఘటనలతో ఇంట్లో కూలర్లు ఏర్పాటు చేసుకున్న వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

- పలు సమస్యలపై చర్చ

నవతెలంగాణ-కామారెడ్డి


కలెక్టర్‌కు బొకేను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను శుక్రవారం కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ చర్చల్లో జిల్లా కలెక్టర్ దృష్టికి వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు, దోమల నివారణ చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం నుంచి చేపట్ట వలసిన చర్యలు జిల్లా అధికార యంత్రాంగం నుంచి చేపట్టవలసిన చర్యల గురించి చర్చించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. తాగునీటి నివారణకు చర్యలను కూడా చర్చించారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చే విధంగా పట్టణంలో ఉన్నటువంటి సమస్యలు వీధి దీపాలు, పార్కు అభివృద్ధి అంశాలను చర్చించినట్టు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, వీటికి సంబంధించి ఒక రూట్ మ్యాప్ తయారుచేస్తానని వెల్లడించారని తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, పాత శివ కృష్ణ మూర్తి, చాట్ల వంశీ పాల్గొన్నారు.